www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 5 ఆగస్టు 2025
5
అన్నమయ్య

ఊపందుకున్న 'స్థానిక' వేడి!

- ఎన్నికల ప్రచారంలో వైసిపి జోరు
- ఒంటిమిట్ట టిడిపిలో ముక్కోణపు రాజకీయం
- జడ్‌పిటిసి అభ్యర్థిని ఎంపిక చేయలేని వైనం
- పులివెందులలో టిడిపి బ్లాక్‌మెయిల్ రాజకీయం

ప్రజాశక్తి – కడప ప్రతినిధి

జిల్లాలో జడ్‌పిటిసి ఉప ఎన్నికల రాజకీయం వేడెక్కింది. ఈనెల ఒకటిన నామినేషన్ దాఖలు దగ్గర నుంచి మంగళవారం నాటి స్క్రూటినీ వరకు పోటీచేసుకున్న పరిణామాలను పరిశీలిస్తే వైసిపి ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉండగా, టిడిపిలో నిరుత్సాహ, ఊగిసలాట వాతావరణం కనిపిస్తోంది. ఒంటిమిట్ట టిడిపిలో గ్రూపు రాజకీయాల కారణంగా అభ్యర్థిని ఎంపిక చేసుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికల ప్రచారంలో వైసిపికి ధీటుగా టిడిపి హోరాహోరీగా సాగిస్తున్నప్పటికీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు సాగించిన నేపథ్యంలో గెలుపు కష్టమనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా టిడిపి అభ్యర్థుల పరిస్థితి ఆశించిన రీతిలో లేదనే వాతావరణం కనిపిస్తోందని చెప్పవచ్చు. ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. పులివెందుల వైసిపి జడ్‌పిటిసి అభ్యర్థి హేమంత్‌రెడ్డి, టిడిపి అభ్యర్థి మారెడ్డి లత ఎన్నికల ప్రచారం నువ్వానేనా అనే రీతిలో కొనసాగుతోంది. పులివెందుల జడ్‌పిటిసి పరిధిలో టిడిపి నాయకత్వం అధికార దర్పంతో భారీగా ఎన్నికల ప్రలోభాలకు తెర లేపినట్లు తెలుస్తోంది. ఐదు రోజుల వ్యవధిలోనే పలువురికి రేషన్ డీలర్ దుకాణ కేటాయింపు హామీలు, వైసిపి హయాంలో భూ కబ్జాల కేసుల్లో ఇరుకున్న వైసిపి నాయకులను గుర్తించి వారి కేసుల మాఫీ, డబ్బులను ఎర వేస్తూ ముందుకు సాగుతోందనే వాదన వినిపిస్తోంది.

ప్రచారంలో వైసిపిదే హవా

జిల్లాలో ఒంటిమిట్ట, పులివెందుల ఎన్నికల ప్రచారంలో వైసిపి ముందంజలో కొనసాగుతోంది. పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి, ఇతర ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యే, ఎంపీల అండదండలతో ఎలాగైనా గెలుస్తామనే ధీమాతో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం సాగిస్తోంది. వైసిపి నాయకత్వం వైసిపి అభ్యర్థి హేమంత్‌రెడ్డి తండ్రి మరణించిన స్థానంలో బరిలో దిగడంతో ప్రజల సానుభూతి లభించే అవకాశం, వైసిపి సంస్థాగత బలం ఆధారంతో ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒంటిమిట్ట ఎన్నికల ప్రచారంలో వైసిపి అప్రతిహతంగా ముందుకు సాగిపోతోంది. ప్రత్యర్థి వైసిపి అభ్యర్థికి స్థానిక ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, స్థానిక రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథరెడ్డి, లోక్‌సభ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సామాజిక, రాజకీయ, ఆర్థిక అండదండలతో గెలుపుపై ధీమాతో ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒంటిమిట్ట టిడిపి గ్రూపు రాజకీయాలతో సతమతమవుతోంది.

టిడిపిలో గ్రూపు రాజకీయాల జోరు

రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, మేడా విజయశేఖర్‌రెడ్డి, బత్యాల చెంగల్రాయులు తదుపరి గ్రూపు రాజకీయం నడుస్తోంది. చమర్తి అభ్యర్థిత్వాన్ని ఎంపిక చేయలేని పరిస్థితి కనిపిస్తోంది. ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానానికి 12 మంది నామినేషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో ప్రధానంగా ఇద్దరు ఒసిలు, ఇద్దరు బిసి అభ్యర్థులు ఉన్నట్లు సమాచారం. గ్రూపు రాజకీయాల కారణంగా జడ్‌పిటిసి అభ్యర్థిత్వం, ఎన్నికల ప్రచారం సాగించడంపై సీరియస్‌గా దృష్టి సారించలేని పరిస్థితి కనిపిస్తోంది.

'చమర్తి'కి స్వేచ్ఛనిచ్చేనా!

చమర్తి జగన్మోహన్‌రాజుకు పూర్తి స్వేచ్ఛనిస్తేగానీ ముందుకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే ప్రత్యర్థి వైసిపి నాయకత్వం ఎన్నికల అభ్యర్థిత్వం ఎంపిక, ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తోంది. ఓటుకు రూ.రెండు వేల చొప్పున పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు నిధులు సైతం చేర వేసినట్లు ప్రచారం నడుస్తోంది. ఓటుకు నోటు పంపిణీ అంశంపై ప్రత్యర్థిని ధీటుగా ఎదుర్కొనే ఆర్థిక సత్తా కలిగిన గ్రూపు నాయకున్ని ఎంపిక చేసి పగ్గాలు అప్ప గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అసెంబ్లీ ఎన్నిక గుణపాఠం తప్పేనా

జిల్లాలో టిడిపి జడ్‌పిటిసి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఆశించిన రీతిలో సాగడం లేదు. రాష్ట్రంలో అధికారం ఉందనే దర్పంతో నిర్లక్ష్యం, నైరాశ్యం ఏర్పడినట్లు కనిపిస్తోంది. ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికల వ్యూహాలను ఓసారి పరిశీలిస్తే ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఎన్నికల తీరును, ముక్కోణపు గ్రూపు రాజకీయాలను పరిశీలిస్తే కేడర్‌ను గందరగోళంలో పడినట్లు కనిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీలో సుగవాసికి కలిగిన అనుభవం పునరావృతం అవుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది. టిడిపి రాష్ట్ర నాయకత్వం మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్ప వచ్చు.

'మాండవ్య'కు మురుగు నీటి ముప్పు

- నదిలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- మురుగునీటి కుంటగా మారిన వైనం
- దశాబ్దాలుగా అధికారులను వీడని నిర్లక్ష్యం, అలసత్వం
- ప్రజారోగ్య పరిరక్షణ గాలికి

మాండవ్య నదిలో కలుస్తున్న మురుగు నీరు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. పట్టణ పరిధిలోని నివాసాల నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలు, మురుగు నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో పట్టణంలోని మురుగు నీటి కాలువలు అన్నీ నదిలోకే వదిలేశారు. పట్టణం నడిబొడ్డు నుంచి ప్రవహిస్తున్న నది మురికికుంటలా మారింది. చెత్తకుండీని తలపిస్తోంది. ఒకప్పుడు వీరభద్రుని భక్తులు పుణ్యనదిలా, పట్టణ వాసులకు తాగునీటి జలవనరుగా, ఆహ్లాదకరంగా ఆటలాడుకునే ప్రదేశంగా విలసిల్లిన మాండవ్యనది ప్రాంతం. అదే నది నేడు పాలకుల నిర్లక్ష్యం, అంతులేని అలసత్వం, ముందుచూపు లేనికారణంగా మురికినీటికుంటలా చెత్తకుండీలా మారింది. కంపచెట్లతో మట్టిదిబ్బలతో నిండి దుర్గంధాన్ని, పందులు, దోమలకు ఆవాసంగా మారింది. లక్షలపైగా జనాభాకలిగిన పట్టణ ప్రజల ఆరోగ్యానికి తీరని ఇబ్బంది కలిగిస్తోంది.

రాయచోటి పట్టణం మధ్యలోనుండి మాండవ్యనది ప్రవహిస్తూ ఉంది. నాలుగు దశాబ్దాల క్రితం వరకు వీరభద్రుడి భక్తులు నదిలో స్నానమాచరించిన తర్వాతే స్వామివారి దర్శనానికి వెళ్లేవారు. పట్టణమంతా ఉప్పనీరే లభిస్తుండడంతో ప్రజలు నదిలోని 8 బావుల ద్వారా లభించే మంచినీటినే తాగేందుకు వినియోగించుకునే వారు. పిల్లలు, పెద్దలు సైతం నిత్యం నదిలోని ఇసుకలో పలురకాల ఆటలాడుతూ సేదతీరేవారు. మూడుదశాబ్దాలుగా పాలకులు ప్రజారోగ్యాన్ని గాలికి వదలేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా పట్టణంలోని మురుగునీరంతా నదిలోకే చేరుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం తోడవడంతో బావులలోని నీరంతా కలుషితమైంది. నదిలో కంపచెట్లు ఏపుగా పెరగడంతో ప్రజలు ఆటువైపు వెళ్ళే పరిస్థితి లేకుండా పోయింది.

2006లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణంలో మురుగునీటి కాలువల కోసం, మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు కోసం రూ.22 కోట్లు కేటాయించింది. నదికి ఇరువైపుల పెద్దకాలువలు నిర్మించి మురుగునీటినంతా వాటిద్వారా పట్టణ శివార్లలో నిర్మించే మురుగునీటి శుద్ధి కేంద్రంకు తరలించి నీటిశుద్ధి అనంతరం నదిలోకే నీటిని వదిలేలా డిజైన్‌ను రూపొందించారు. కాలువ పనులు పూర్తయినప్పటికీ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం పనులు అప్పట్లో నక్కావాండ్లపల్లె ప్రజలు వ్యతిరేకించడంతో పనులు ఆగిపోయాయి. ఇదే సమయంలో మురుగునీటిని పట్టణం వెలుపలకు తీసుకెళ్లే కాలువల నిర్వహణను సరిగా చేపట్టక పోవడం, కొన్ని చోట్ల కాలువలు పగిలిపోవడం, నదిలోకే చేరి పెద్దఎత్తున నిలవ ఉంటోంది. టిడిపి ప్రభుత్వంలో 2018లో తెలుగుదేశం ప్రభుత్వం నీరు-చెట్టు పనుల కింద మాండవ్య నదిని పూర్తి స్థాయిలో శుభ్రపరిచారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొద్ది రోజులకే తిరిగి నదిలోకే చేరి మురికికూపంలా తయారైంది. అక్కడే పందులు సంచారం ఇబ్బందికరంగా మారుతోంది. సంవత్సరాల తరబడి నదిలో మురుగునీరు నిల్వ ఉండడం కారణంగా వెదజల్లే దుర్గంధంతో పట్టణంలోని పాత రాయచోటి, బ్రహ్మణవీధి, బీరాసాహెబ్‌వీధి, హరినాథవీధి, కొత్తపేట ప్రజలు తల్లడిల్లుతున్నారు. దోమలు సైతం విజృంభిస్తుండడంతో ప్రజలు విషజ్వరాలతో పాటు పలురకాల వ్యాధులకు గురవుతున్నారు. నదిలో మనుషులు సంచరించే పరిస్థితి లేకపోవడంతో కొందరు నదిపరిసరాలను ఆక్రమించుకుని పక్కాగృహాలను నిర్మించుకున్నారు. బలమైన విమర్శలు ఉన్నాయి. ఇంకొందరు పట్టణంలో నూతనంగా నిర్మించే గృహనిర్మాణ వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా నదిలోకే వదలుతున్నారు. మట్టిదిబ్బలు, నదిస్థలం ఆక్రమణల కారణంగా నదికి వరదలు వచ్చిన సమయంలో ఇళ్లలోకి నీరుచేరుతుంటుంది. నదీపరివాహక ప్రాంత నివాసప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, ఇరిగేషన్‌శాఖ అధికారులు సంయుక్తంగా నదిని శుభ్రపరిచి మురుగునీరు నిల్వలేకుండా చూడడం ద్వారా తమ ఆరోగ్యాన్ని పరిరక్షించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కంపచెట్లతో నిండిఉన్న మాండవ్యనది

దుర్గంధం వెదజల్లుతోంది

మాండవ్య నదిలో మురుగునీటి నిల్వకారణంగా దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు విజృంభిస్తుండడంతో తరచూ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఫలితంగా నదికి ఇరువైపుల నివాసాలు ఉన్న ప్రజలు ఇబ్బందుల పడుతున్నారు. వెంటనే అధికారులు తగుచర్యలు తీసుకోవాలి.

- రెడ్డెన్న, బ్రహ్మణవీధి.

నదిని వెంటనే శుభ్రపరచాలి

కొన్నేళ్ల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులు మాండవ్యనదిని శుభ్రపరిచారు. తర్వాత పూర్తిగా పట్టించుకోలేదు. నదినిండా మురుగునీరు, చెత్తాచెదారం, మట్టిదిబ్బలతో నిండి అస్తవ్యస్తంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు నదిని శుభ్రపరిచే పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి.

- హనీఫుల్లా, పాత రాయచోటి.

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి



నదిలో ఏపుగా పెరిగిన కంపచెట్లు, పేరుకుపోయిన మట్టిదిబ్బలు నడుమ ఏళ్లతరబడి మురుగునీరు నిల్వఉండడం, పందుల సంచారంతో దోమలు ఎక్కువవుతున్నాయి. ఫలితంగా చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు విషజ్వరాలు, వ్యాధుల బారినపడుతున్నారు. అధికారులు ప్రజారోగ్యపరిరక్షణ చర్యలు చేపట్టాలి.

- షరీఫ్, పాత రాయచోటి.

పనిచేయని సెల్‌ఫోన్లు మాకొద్దు

- నిరసనలో అంగన్వాడీల డిమాండ్

రైల్వేకోడూరు : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గత ప్రభుత్వంలో అంగన్వాడీలకు ఇచ్చిన సెల్‌ఫోన్లు సరిగా పనిచేయడం లేదని, అవి మాకొద్దంటూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. పనిచేయని సెల్ ఫోన్లను సిడిపిలకు అప్పగించారు. సోమవారం సిడిపిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్స్, మినీ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీలక్ష్మి, ఎఐటియుసి అధ్యక్షులు సరోజినమ్మ పేర్కొన్నారు. కార్యకర్తలు, మినీ వర్కర్లు 248 అంగన్వాడీ కేంద్రాలు కార్యకర్తలు, మినీ టీచర్లు ప్రభుత్వం ద్వారా ఇచ్చిన సెల్‌ఫోన్లను తిరిగి ఇచ్చేసామని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు రూ.11,500 వర్కర్లకు, మినీ వర్కర్లకు రూ.7వేలు చాలా తక్కువ వేతనాలు ఇస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఉండే ధరలకు అనుగుణంగా మా కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. 2017 నుంచి టిఎ,డిఎలు నిలిపివేశారన్నారు. కార్యక్రమంలో సిఐటియు ప్రాజెక్ట్ లీడర్లు రమాదేవి, రాధా, పద్మ, వనజ కుమారి జయలక్ష్మి, నిర్మల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** ఈ ఫోన్లు మాకు వద్దు బాబోయ్, ఆన్‌లైన్ వర్క్ చేయలేక పోతున్నాం. రికార్డుల ద్వారానే సరుకులు పంపిణీ చేస్తాం అంటూ అంగన్వాడీలు సిడిపిఒ కార్యాల యంలో తిరిగి ఇచ్చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మధురవాణి, రాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ ఫోన్లు ఏ మాత్రం పని చేయడం లేదన్నారు. పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్స్‌కు సపోర్ట్ చేయడం లేదన్నారు. ముఖ్యంగా ఎఫ్ ఆర్ ఎస్ ద్వారా సరుకుల పంపిణీకి తీవ్ర ఆటంకం కలిగిస్తోందని, సర్వర్ పనిచేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కావున ఇకనుంచి తాము ఆన్‌లైన్ ద్వారా పనులు పనిచేయలేమని, గతంలో మాదిరిగానే రికార్డుల్లో రాసి, సక్రమంగా సరుకులు పంపిణీ చేస్తామని తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ కు జిఒ ప్రకారం వేతనాలు పెంచాలని, మినీ వర్కర్స్ ని మెయిన్ వర్కర్స్ గా గుర్తిస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ని సెక్టార్ సూపర్‌వైజర్లకు సెల్‌ఫోన్లను అప్పగించామని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్‌లతో పని భారం ఎక్కువ అవడం, మొబైల్ ఫోన్లు మొరాయిస్తుండడంతో సమాచారం నిక్షిప్తం చేయడం కష్టంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి కార్యదర్శి ఓబులమ్మ, గౌరవ అధ్యక్షురాలు, ప్రభావతి సెక్టార్ లీడర్లు రుక్మిణి, శిరీష, శారద, నాగమణి పాల్గొన్నారు.

'గడికోట'ను కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: స్థానిక పట్టణంలోని వైసిపి కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిని పలువురు న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో న్యాయవాదులు ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులపై పెడుతున్న అక్రమ కేసులు, రాజకీయ కక్ష సాధింపు చర్యలపై చర్చించారు. ఇందుకు స్పందించిన శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడడం న్యాయవాదుల బాధ్యత అని, పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను చట్టపరంగా ఎదుర్కొనాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వ చర్యలను నిలదీయడానికి న్యాయవాదులు ఐక్యంగా ముందుకు రావాలని సూచించారు. న్యాయవాదులు తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైసిపి లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, న్యాయవాదులు హిదయాతుల్లా, రాజశేఖర్‌రెడ్డి, రామ్ కుమార్, వెంకటేశ్వర్లు, పవనీష్ రెడ్డి,రవీంద్ర పాల్గొన్నారు.

18 నుంచి 'మిట్స్'లో బిటెక్ మొదటి సంవత్సరం తరగతులు

ప్రజాశక్తి-మదనపల్లె: అంగళ్లు సమీపంలోని మిట్స్ యూనివర్శిటీలో ఈనెల 18 నుంచి బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతులు ప్రారంభమవుతాయని యూనివర్శిటీ ప్రతినిధి డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభాన్ని ప్రకటించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తొలి సంవత్సరం విద్యార్థులంతా సూచించిన తేదీన యూనివర్శిటీ క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు విద్యా విధానాలు, క్యాంపస్ జీవితం, సంస్థాగత విలువల పరిచయంతో ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యాభ్యాసంలో సంగీతం భాగమవ్వాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: విద్యాభ్యాసంలో సంగీతం కూడా భాగం కావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం సొసైటీ కాలనీలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన మ్యూజిక్ అకాడమీ వింగ్‌ను ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే కు పాఠశాల కెరస్పాండెంట్ డాక్టర్ ఎన్ సేతు, ప్రిన్సిపాల్ నిశ్చల సేతు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయభారతి పాఠశాలలో క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉండడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుండే విద్యతో పాటు ఆటలు, పాటలు, క్రీడలు అవసరమన్నారు. సంగీతానికి ముఖ్యం వాయిద్యాలు అవరమని, అలాంటి మ్యూజిక్ అకాడమీని జిల్లా వ్యాప్తంగా మొదటిసారిగా విజయభారతి పాఠశాల డాక్టర్ ఎన్. సేతు ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. సంగీతం వల్ల ఒత్తిడిని అధిగమించి, రిలాక్స్ అవుతామన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే సంగీతం లో తర్ఫీదు ఇవ్వాలన్న ఉన్నత ఆశయంతో మ్యూజిక్ అకాడమీని ఏర్పాటు చేయడం స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో చల్లపల్లి నరసింహారెడ్డి, బండి ఆనంద్, డాక్టర్ అబ్మతుల్లాఖాన్, టిడిపి నాయకులు జెసిబి మధు, వేణు, నవీన్ చౌదరి, రంగస్వామి నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిటారు వాయిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తుందని, అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం : డిసిసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం చురుకైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆ దిశగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ప్రముఖులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి సుబ్బమ్మ తో పాటు ఆ పార్టీ నాయకులు అరుణ కుమారి, నరసింహ, శివరాం, మౌనిక, శ్రావణి, హారిక, సుందరం, వీరేందర్, శేఖర్, పలువురు మహిళా కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారని తెలిపారు. పార్టీలోకి నూతన నేతల చేరిక ద్వారా కాంగ్రెస్ బలోపేతం కావడంతోపాటు, రాబోయే ఎన్నికల్లో విజయపథంలో ముందుకు సాగుతామని అన్నారు. సుబ్బమ్మ మాట్లాడుతూ షర్మిల నాయకత్వం కింద రాష్ట్రానికి అవసరమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు దర్బార్ బాషా, జిల్లా కాంగ్రెస్ చీఫ్ సెక్రటరీ అమీర్, సుండుపల్లి మండల అధ్యక్షుడు సల్మాన్, చిన్నమండెం మండల అధ్యక్షుడు షబ్బీర్, అమీర్ భాష, రఫీ, గిరిబాబు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

ప్రజాశక్తి-రాయచోటి

రైతులను కుటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని రాష్ట్రంలో యూరియాతో సహా ఎరువుల కొరత, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎరుపురెడ్డి ఆరంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నేతలు స్టేట్ బూత్ కమిటీ జనరల్ సెక్రెటరీ రెహమాన్ ఖాన్, మదనపల్లి నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు జన్నే రాజేంద్ర నాయుడు, గుర్రంకొండ మండల రైతు విభాగం అధ్యక్షులు గురు శేఖర్, వాల్మీకిపురం మండల రైతు విభాగం అధ్యక్షులు వై. మహేశ్వర్ రెడ్డి, జిల్లా ఎస్‌టి సెల్ ప్రెసిడెంట్ చంద్ర నాయక్, చిన్నమండెం మండల రైతు విభాగం అధ్యక్షులు తమటం విశ్వనాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌కు ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి–రాయచోటి అర్బన్ : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, స్థానిక అధికారులు పరిష్కరించాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే నూతన అక్రిడిటేషన్లను మంజూరు చేయాలని తెలిపారు. అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాల మంజూరు చేయాలన్నారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక ప్రచురణను పునరుద్ధరణ చేయాలని కోరారు. సమాచార శాఖను మరింత బలోపేతం చేయాలన్నారు. జర్నలిస్టులకు ఎసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. మీడియా అకాడమీ గవర్నర్ కౌన్సిల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులు అవార్డులో ఉద్యోగ భద్రత, ఆరోగ్య భీమా లాంటి తదితర సదుపాయాలు కల్పించాలంటే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర మోహన్‌రాజు, జయరాజ్, రఘురామ రాజు, కలీం, సుబ్బారెడ్డి, రవిరాజు, సూర్య ప్రకాష్ రాజు, నవాజ్ షరీఫ్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-మదనపల్లె

ఇంజినీరింగ్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.రామలింగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య భవిష్యత్తుకు బలమైన పునాది అని, విద్యార్థులు తమ లక్ష్యాలను మొదటి రోజే ఖరారు చేసుకోవాలని సూచించారు. కాలేజీలోని వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు మాట్లాడుతూ పాఠ్యవిధానాలు, ప్రయోగిక శిక్షణ మధ్య సమతుల్యత అవసరమని, విద్యార్థులు నైతిక విలువలతో పాటు సాంకేతిక నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలన్నారు. అధ్యాపక బృందం విద్యార్థుల ప్రగతికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.డీన్ అకాడమిక్స్ డాక్టర్ వివిఎన్. భాస్కర్ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ కేవలం పుస్తకాలకే పరిమితం కాదని ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనాలన్నారు. శ్రమ, సమయపాలన అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల కరస్పాండెంట్ రామ్మోహన్ రెడ్డి, ప్రెసిడెంట్ నాగ మల్లారెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల న్యూస్ లెటర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో..

రాయచోటి : శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పి. శంకర్ విద్యార్థులను ఉద్దేశించి విలువైన సూచనలు అందించారు. అధ్యయన కాలం మొత్తం విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాజెక్టుల రూపకల్పనలో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పరిశోధనల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా ఈ సంస్థ సాంకేతిక విద్యలో నూతన ప్రథమాలను నెలకొల్పిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ హెడ్ డాక్టర్ ఎన్. నాగేంద్ర, ఇతర శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తకాలను పంపిణీ చేస్తున్న వెంకటరమణ

విలువల విద్య పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి జడ్పిహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ సోమవారం విద్యార్థులకు విలువల విద్య పుస్తకాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించే విధంగా, సంస్కారవంతమైన విషయాలతో పాటు శతక సాహిత్యంలోని కొన్ని పద్యాలను ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు సూచనలతో విలువల విద్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. వినయము, నిజాయితీ, కుటుంబ సంబంధాలు విద్యార్థులకు తెలియజేయడంతో పాటు సమాజ హితానికి పాటుపడాలనే విషయం విద్యార్థి దశలోనే వారిలో ఆలోచన రేకెత్తించడం ఈ పుస్తకాల ద్వారా సాధ్యపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్లోరీ కిరణ్ ఉజాల, శిల్పి ఆనంద చారి, బోగా వెంకటసుబ్బయ్య, విజయకుమారి, మస్తాన్, జివి.ప్రసాదరావు, ఆర్వి.రమణమ్మ, జ్యోతి ప్రియ, గొంటుముక్కుల వెంకట రమణ , గీత, గౌరీ, గాయత్రి దేవి, డాక్టర్ శర్వాణి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాట్లాడుతున్న అతికారి దినేష్

అధిష్టానం ఆదేశాల మేరకు ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయడం లేదని, కూటమిలో భాగంగా మిత్ర పక్షమైన టిడిపి అభ్యర్థిని జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి గెలిపించుకోవాలని రాజంపేట అసెంబ్లీ జనసేన ఇన్‌ఛార్జి అతికారి దినేష్ పేర్కొన్నారు. కూటమి అభ్యర్థి విజయానికి జనసేన శ్రేణులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. జనసేన పార్టీ పేరుతో ఎవరైనా అభ్యర్థులు పోటీలో ఉంటే వారికి, జనసేన పార్టీకి ఎటువంటి సంబంధం లేదని అలాంటి వ్యక్తులపై పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపడుతుందని హెచ్చరించారు. ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని కూటమి నిర్ణయించిన టిడిపి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు.

నేలమల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో ప్రముఖ నేలమల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం నేలమల్లేశ్వర స్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ ఇఒ మంజుల, ఆలయ అర్చకులు శంకర శర్మ, లక్ష్మణస్వామిలు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కోటి రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన శ్రీ నేలమల్లేశ్వరస్వామి గర్భగుడి ఆలయాన్ని దేవాదాయశాఖ అధికారులు, స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద మూడు రోజులగా పవిత్ర హెూమాలు, విగ్రహాల ప్రతిష్టలు అంగరంగ వైభవంగా జరిగాయన్నారు. సోమవారం శ్రీ కామేశ్వరి సమేత నేలమల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. కోటి రూపాయల నిధులతో చేపట్టిన స్వామివారి గర్భగుడిని ప్రారంభించే భక్తులకు స్వామివారి దర్శనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. త్వరలోనే గర్భగుడి ముందు భాగంలో నిర్మించదలచిన మహా మండపం, ఆస్థాన మండపాలకు అవసరమైన 3.18 కోట్ల రూపాయల నిధులను దేవాదాయ శాఖ అధికారులతో చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. చౌడేపల్లి నుంచి భక్తులు రావడానికి అనువుగా అటవీ మార్గం గుండా ఆలయం వద్దకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆలయం వద్ద సెల్ టవర్ ఏర్పాటు చేయాలని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ ఇఒ మంజుల, అర్చకులు శంకర శర్మ, లక్ష్మణస్వామి, రాజన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

యాప్‌లపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి: వెలుగు సమాఖ్యకు సంబంధించిన వివిధ రకాల యాప్ లపై మహిళ సభ్యులకు అవగాహన కార్యక్రమం స్థానిక వెలుగు మహిళ సమాఖ్య కార్యాలయంలో ఎపిఎం దేవసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలం వెలుగు కార్యాలయంలో సంఘమిత్రాలకు లోకోస్, ఎస్ హెచ్ జి ప్రొఫైల్, విఒ ప్రొఫైల్, విఒ కట్‌ఆఫ్ లపై శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. సంఘంలో ఉన్నటువంటి సభ్యులసమాచారం, గ్రామ సంఘాల సమాచారం తెలుస్తుందని, దీనివలన వారి ఆర్థిక పరంగా అభివృద్ధి చెందిన వివరాలు తెలుస్తాయని అన్నారు.సభ్యురాలు సంఘంలో చేరిన తర్వాత వారి ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సిసిలు, లోకోస్ ఇఎంటిఎస్, సంఘమిత్రాలు పాల్గొన్నారు.

వైసిపి పట్టణ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-బి.కొత్తకోట : తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు బి.కొత్తకోట వైసిపి పట్టణ అధ్యక్షుడు సి.ఆర్.చిన్నకృష్ణ ఆధ్వర్యంలో పట్టణ వైసిపి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఇందులో పట్టణ ఉపాధ్యక్షుడిగా సోము, బి.సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నవీన్, మోహన, తుమ్మగింజల జనార్ధన్, ఆదాం, కార్యదర్శులుగా సి.గౌతంరెడ్డి డి.చలపతి బి.నవీన్,జయ చంద్ర, ఎస్.కలీం,ఎగ్జిక్యూటర్ మెంబర్లుగా సద్దాం, శ్రీరాములు, టిప్పు సుల్తాన్, రియాజ్,ముజీర్ షేక్, తరుణ్,బావా జాన్, ఎర్రగడ్డ సాబు ఎంపిక చేసినట్లు పట్టణ అధ్యక్షుడు సి.ఆర్.చిన్నికృష్ణ తెలిపారు. పట్టణంలో వైసిపి బలోపేతానికి నూతన కమిటీ పనిచేయాలని సూచించారు.కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని,తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.ఇప్పటినుండే ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి 2029లో వైఎస్ జగన్ మరోసరి ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

9న భువనగిరి నరసింహస్వామి కల్యాణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :మండల పరిధిలోని భువనగిరి పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామికి ఈ నెల 9వ తేదీన అత్యంత వైభవోపేతంగా కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ పెద్దలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10:30 గంటల నుంచి12 గంటల వరకు ముత్యాల తలంబ్రాలతో వేదపండితుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు కళ్యాణం అనంతరం విశేష అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

అనపగుట్ట స్టోర్ డీలరుగా నందినినే కొనసాగించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని 1వవార్డు పరిధి, అనపగుట్టలో గల 1081047 నెంబర్ స్టోర్ డీలర్‌గా ఎన్.నందినినే కొనసాగించాలని సోమవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు రేషన్ కార్డుదారులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కార్డుదారులకు క్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నందిని ని మార్పు చేస్తున్నారనే విషయంపై ఆ వార్డు ప్రజలు తీవ్రంగా స్పందించారు. అధిక సంఖ్యలో కార్డుదారులు ఎమ్మెల్యే ను కలిసి నందిని ని మార్పు చేయొద్దని విన్నవించారు.

LOST OF PASSPORT

I Mekala Venkata Ramana S/o Mekala Venkata subbaiah,R/O 4/189, I sukapalli Madanagopala puram, Rajampet, Annamaiah Dt.I have losted my original passport bearing S 0941407, while traveling. If anyone found plz inform: **9000661648.**

సహకార సంఘం అభివృద్ధికి కృషి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన సహకార సంఘం అధ్యక్షుడు నల్లారి చంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలికిరి సహకార బ్యాంకు చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకరోత్సవం కార్యక్రమం ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ కష్ట కాలంలో ఉన్న రైతులకు సహకార సంఘం ద్వారా రుణాలు ఇచ్చి ఆదుకుంటామని, ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం డైరెక్టర్లుగా అల్లాబక్షు, సుబ్బయ్యచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహ కార సంఘం ద్వారా ప్రజలందరికీ న్యాయం చేయాలని చంద్రకుమార్ రెడ్డికి ఈ పదవి ఇవ్వడం జరిగిందని, రైతుల అభివృద్ధి ధ్యేయంగా సహకార సంఘం పనిచేయాలని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారపక్షం కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసినా కష్ట కాలంలో కూడా నాయకులు కార్యకర్తలు మకు అండగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్యే పదవి ఉండడం ప్రజాసేవకే తప్ప భూ దందాలకు, ఇసుక దోపిడీకి, అక్రమ ఎర్రచందన రవాణాకు కాదని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా బలంతోనే అధికార పక్షాన్ని ఎదుర్కొన్నామని, నాణ్యత లేని మద్యం తయారు చేసి కోట్ల రూపాయలు ధనాన్ని ఆర్జించి, ప్రజా ఆరోగ్యాలతో ఆడుకుని ఎంతోమంది ప్రజల ఉసురుతీసారని అన్నారు. ఆ డబ్బుతో ఎన్నికల్లో నియోజకవర్గానికి 100 కోట్లు ఖర్చు చేశారని, వారి పాపం పండి ఓటు ద్వారా ప్రజలు వారికి బుద్ధి చెప్పారని విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా సంక్షేమ కార్యకలాపాలను, సూపర్ సిక్స్ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని, సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకపోతే వారికి ఇప్పించే బాధ్యత నాయకులు కార్యకర్తలదేనని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఇంతియాజ్ అహ్మద్, మాజీ సర్పంచ్ లక్ష్మీకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి, వైస్ చైర్మన్ సనవుల్లా, ఎల్లమ్మగుడి చైర్మన్ అశోక్‌రెడ్డి, యోగేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**పీలేరు:** అన్నదాతల సంక్షేమం అభివృద్దే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, సహకార సంఘాలకు పాలకమండళ్ల నియామకాలు జరుగుతున్నాయని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం పీలేరు, కలిరికి, కలకడ సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ పాలనలో రైతుల కోసం చేసింది ఏమీ లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్రం రూ.2 వేలు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు కలిపి మొత్తం

కలకడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని అన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు కావాల్సిన రుణాలు మంజూరు చేయించడానికి కృషి చేస్తామని చెప్పారు.ః పీలేరు సింగిల్ విండో ఛైర్మన్ గా యల్లెల రెడ్డెప్పరెడ్డి, డైరెక్టర్లుగా పీలేరుకు చెందిన అమానుల్లా, గూడరేవుపల్లెకు చెందిన పుల్లయ్య, కలికిరి సింగిల్ విండో ఛైర్మన్ గా నల్లారి చంద్రకుమార్ రెడ్డి, డైరెక్టర్లుగా సుబ్బయ్య, అల్లాబక్షు, కలకడ సింగిల్ విండో చైర్మన్‌గా మద్దిపట్ల వెంకట్రమణనాయుడు, డైరెక్టర్లుగా గిరిజమ్మ, వెంకట్రమణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్షులుగా మద్దిపట్ల వెంకటరమణ..

కలకడ : సింగిల్ విండో అధ్యక్షులుగా మద్దిపట్ల వెంకటరమణ నాయుడుప్రమాణ స్వీకారం చేశారు. మండల కేంద్రమైన కలకడ సింగల్ విండో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని అన్నారు. గతంలో పార్టీ కోసం పనిచేసే మండల పార్టీ అధ్యక్షులుగా పగ్గాలు పట్టి పార్టీని బలోపేతం చేసిన వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, కలికిరి మార్కెటింగ్ యార్డ్ డైరెక్టర్ ముబారక్ అలీ మద్దిపట్ల వెంకటరమణ నాయుడును ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో మాజీ పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లారపు రవిప్రకాష్‌నాయుడు, మాజీ ఎంపిపి వంగిమళ్ళ మధుసూదన రెడ్డి, కాంతారావు, పొత్తూరి శ్రీకాంత్ నాయుడు, కలకడ మండల యూనిట్ ఇన్‌ఛార్జి వై. జిలానీబాషా, బూత్ కన్వీనర్లు జాఫర్ హుస్సేన్, ఖాజా హుస్సేన్, ఇర్ఫాన్‌బాషా పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చడమే సిఎం ధ్యేయం : ఎమ్మెల్యే

నిమ్మనపల్లి: వితంతువుకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చడమే సిఎం చంద్రబాబు ధ్యేయంగా ముందుకు వెళుతున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం నిమ్మనపల్లి మండలంలో ఆయన పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇటీవల భర్త చనిపోయిన మహిళలకు నూతనంగా వితంతు పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. మండలంలో 95 మందికి వితంతు పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. నూతన పింఛనుదారులకు రూ.4వేలుపింఛన్ నగదను స్థానిక కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు మాట ఇచ్చారంటే దానిని నెరవేర్చడానికి అహర్నిశలు కృషి చేస్తారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమలను తీసుకువస్తూ సంపదను సృష్టిస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నాదని తెలిపారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలలోని దీపం పథకం, నిరుద్యోగులకు డిఎస్‌సి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, సామాజిక పింఛన్ల పెంపు, త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటివి అమలు చేస్తున్నట్లు తెలిపారు. భర్త చనిపోయిన మహిళలు కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్న సదుద్దేశంతో వారికి వెంటనే వితంతు పింఛన్లను మంజూరు చేసి నాలుగు వేల రూపాయలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె. వెంకటేష్, మాజీ జడ్‌పిటిసి సుజాత, పుర్రా వెంకటర మణ, రాజన్న, రెడ్డప్ప రెడ్డి, శ్రీపతి, మునిరత్నం,పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంటు పాల్గొన్నారు. **మదనపల్లె :** మదనపల్లె రూరల్ మండలానికి చెందిన వితంతువులకు మంజూరైన కొత్తగా 220 వితంతు పింఛన్లను ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాసా పంపిణీ చేశారు. ప్రతి వితంతు దరఖాస్తుదారికి రూ.4వేలు పింఛన్ మొత్తం అందించారు. కార్యక్రమంలో చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ సభ్యులు

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన చార్యులు డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం శక్తి టీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ వినియోగం పిఒఎస్‌సి ఒ యాక్ట్, బాల్యవివాహాలు, మత్తు పదార్థాల వల్ల అనర్థాల గురించి వివరించారు. ర్యాగింగ్, సైబర్ క్రైమ్ గురించి తెలిపారు. ఎస్ఐ రహీం విద్యార్థులు నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు దురాలవాట్లకు పాల్పడకుండా కళాశాలలో ప్రశాంత వాతావరణంలో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు రహీం, ఎస్ఐ బి.దశరథ, హెడ్ కానిస్టేబుల్ ఇ.కల్పన, శక్తి టీమ్ మెంబర్లు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన హోంగార్డు సంజీవ్

ప్రజాశక్తి-కలకడ : సివిల్ కానిస్టేబుల్‌గా హోంగార్డు సంజీవ్ ఎంపికయ్యారు. పోలీస్ నియామకాల కోసం నిర్వహించిన అన్ని పరీక్షలలో నెగ్గి సివిల్ కానిస్టేబుల్ గా ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంజీవ్ 2006వ సంవత్సరంలో హోంగార్డుగా ఎంపికై తిరుమల, పీలేరు, మదనపల్లి, కలకడ సిఐకార్యాలయం, ప్రస్తుతం కలకడ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. కలకడ పోలీస్ స్టేషన్ నుంచి సంజీవ్ సివిల్ కానిస్టేబుల్ గా ఎంపిక కావడం పట్ల ఎస్ఐ రామాంజనేయులు, స్టేషన్ సిబ్బంది కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో సమస్యల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామాలలో సమస్యల్లేకుండా విఆర్‌ఒలు అందుబాటులో ఉండాలని తహశీల్దార్ కె. భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం విఆర్‌ఒలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని గ్రామాలలో భూ సమస్యలు లేకుండా అందుబాటులో ఉండాలన్నారు. ఫైల్స్ పెండింగ్ లేకుండా ఎరోజుకా రోజు సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. కార్య క్రమంలో ఎంఆర్ఐ భవాని శంకర్, విఆర్‌ఒలు యశోద, లక్ష్మీప్రసన్న, సుధాకర్, రవీంద్రారెడ్డి, అల్లా బ కాష్, వెంకటేశ్వర్లు పలువురు పాల్గొన్నారు.

విఆర్‌ఒల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ భాగ్యలత

మృతురాలి కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి దళితవాడకు చెందిన చిట్వేలి అచ్చమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న రొంపిచర్ల మురళి కుటుం బీకులు మృతురాలి కుటుంబానికి రూ.20వేలు దహన సంస్కారాల కోసం అందించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ చిట్వేలి అచ్చమ్మకు భర్త ఉండేవాడని ఆయన గతంలోనే మృతి చెందాడని తెలిపారు. అచ్చమ్మ గత ఐదు సంవత్సరాల నుంచి అనారోగ్య సమస్యలతో చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని అన్నారు. మృతురాలికి ఒక కుమారుడు ఉండగా అతని రోజు కూలి పనులకు వెళ్తూ తన తల్లిని గత ఐదు సంవత్సరాల నుంచి ఆస్పత్రిలో చికిత్స చేస్తూ ఉన్నాడని, ఆమె ఆరోగ్య విషమించి మృతి చెందారని తెలిపారు.

మాజీ జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి మీడియా సభ్యులు రాయచోటికి చెందిన మాజీ జర్నలిస్ట్ సుబాష్ చంద్రబోస్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. సోమవారం ఆయన ఇంటి వద్దకు వెళ్లి ఆయన భార్య వెంకటసుబ్బమ్మకు రూ.13 వేలు నగదు ను అందించారు. సుబాష్ చంద్ర బోస్ గతంలో పలు పత్రికలలో పని చేసి తరువాత ప్రయివేట్ అగ్రికల్చర్ సేల్స్ మేనేజర్‌గా పని చేసేవాడు. విధి నిర్వహణలో భాగంగా మే నెల 16వ తేది కేశాపురం వద్ద కారు ఢీకొన్న ప్రమాద సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. నడుములు, కాళ్లు పూర్తిగా విరిగిపోవడంతో రాయచోటి, తిరుపతి ఆస్పత్రులలో చికిత్స చేయించిన ఆరోగ్యం పరిస్థితి కుదుట పడలేదు. విషయం తెలుసుకున్న సహచర జర్నలిస్టుల మిత్రులు ఆయనకు ఈ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రాయచోటి బసయ్య, పివి.నాగయ్య, రాజమోహన్, సూర్య రషీద్, తాతయ్య, ఆది నారాయణ, వెంకట్రామరాజు, రెడ్డయ్య, బాలకృష్ణారెడ్డి, రెడ్డి, రమేష్ బాబు, బీటెక్ శివ, రామ సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ క్రీడా పోటీల్లో విజేత పీలేరు జట్టు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో జరిగిన ఉపాధ్యాయ క్రీడా పోటీల్లో పీలేరు జట్టు ప్రథమ విజేతగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులపాటు క్రికెట్, చదరంగం పోటీలు జరిగాయి. సోమవారం ఈ పోటీలలో ప్రథమ స్థానంలో పీలేరు జట్టు విజయం సాధించి మొదటి బహుమతిని, రాజంపేట జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ జోహర్ అందుకున్నారు. చదరంగం పోటీలలో రాజంపేటకు చెందిన నాగేంద్ర ప్రథమ బహుమతిని, కలకడకు చెందిన సుబ్బరాయుడు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. అనంతరం విజేతలకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, జాబీర్ చేతుల మీదుగా ట్రోఫీలను బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు, ట్రెజరర్ బి. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు అక్రమ్ బాష, రమణమూర్తి, జిల్లా క్రీడా విభాగం కన్వీనర్ సుధాకర్, వ్యాయామ సీనియర్ ఉపాధ్యాయులు నరసరాజు, వివిధ మండలాల నాయకులు పీరయ్య, వెంకటరమణ, విజయ్ కుమార్, రాజు , ఆదర్శ పాఠశాలల రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ ,వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రోఫీ అందుకుంటున్న పీలేరు జట్టు

కంకర లేచిన తారు రోడ్డు

సుండుపల్లి నుంచి రాయచోటికి..

డబుల్ రోడ్డుకు మోక్షమెప్పుడో ?

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లి నుంచి రాయచోటికి డబుల్‌లైన్ రోడ్డు ఎప్పటికీ పూర్తవు తుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రతినిత్యం ప్రజలు వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. గత వైసిపి ప్రభుత్వంలో డబుల్ లైన్ రోడ్డు పనులను ప్రారంభించి కొంతవరకే చేసి వదిలేయడంతో ఆ రోడ్డున వాహనాలు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రాయచోటి నుంచి సుండుపల్లికు వచ్చే వాహనాల్లో చాలా మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిత్యం ఈ రోడ్డున అధికారులు, ప్రజా ప్రతినిధులు తిరుగుతూనే ఉంటారని ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సుండుపల్లె నుంచి రాయచోటికి వెళ్లే ఆర్‌టిసి సర్వీసుల్లో డిపోకు ఎక్కువ ఆదాయం వస్తున్నా..ఈ రోడ్డును మాత్రం అలాగే వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకొని రోడ్డు పూర్తయ్యే విధంగా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చర్చి ఆస్తుల సర్వేను అడ్డుకున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

పట్టణంలోని టోల్గేట్ సమీపంలో గల సౌత్‌ఆంధ్ర లూథరన్ చర్చ్ ఆస్తుల సర్వేను చర్చి కమిటీ చైర్మన్, సభ్యులు సోమవారం అడ్డుకున్నారు. చర్చి కాంపౌండ్‌లో ఉన్న పురాతన బంగ్లా మరికొంత స్థలం ఎస్‌ఎల్ సి సంఘంలో ఒక వర్గం కొంతమేర భూమిని క్రయవిక్రయాలు చేపట్టారు. మరొక వర్గం దీనిని వ్యతిరేకిస్తోంది. స్థలాన్ని కొనుగోలు చేసిన కొనుగోలుదారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. కానీ బంగ్లాలో దశాబ్దాల కాలంగా నివాసముంటున్న నివాసస్తులు ఆ సర్వేను అడ్డుకోవడంతో వివాదం చోటు చేసుకుంది. ఎస్ఐ వి.ఎల్.ప్రసాద్ రెడ్డి సిబ్బందితో ఆ ప్రాంతానికి వచ్చి ఇరువురి వద్ద ఉన్న డాక్యుమెంట్ల నకళ్ళను పరిశీలించారు. అనంతరం సిఐ హేమ సుందర్ వచ్చి కొనుగోలు దారులు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు వారు కొనుగోలు చేశారని, అడ్డుకునేందుకు మీకు ఎలాంటి హక్కు లేదని ప్రశ్నించగా తమకు కొంత గడువు ఇచ్చినట్లయితే హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తామని బంగ్లాలో నివాసం ఉంటున్న కుటుంబాలు సిఐకు వివరించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- తమిళనాడులో ఇద్దరు పీలేరు వాసులు..

ప్రజాశక్తి-పీలేరు

మాజీ సర్పంచ్ హుమయూన్, అతని సోదరుడు షాజహాన్ (ఫైల్‌ఫొటో)

తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పీలేరు మాజీ సర్పంచ్ ఎఎస్ హుమయూన్, అతని సోదరుడు షాజహాన్ మృతి చెందారు. మాజీ సర్పంచ్ కుమారుడు హబీబ్‌బాషా తీవ్రంగా గాయపడి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బంధువుల కథనం మేరకు..గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ హుమయూన్ వైద్యం కోసం సోమవారం తెల్లవారుజామున పీలేరు నుంచి కారులో చెన్నైకు బయలుదేరారని తెలిపారు.వీరి వాహనం తిరుపతి - చెన్నై రహదారిలోని తిరువళ్లూరు జిల్లా, తిరుత్తణి సమీపంలోని ఆర్కాడ్ కుప్పం దగ్గర రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్నట్లు చెప్పారు. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యిందని, కారులో ప్రయాణిస్తున్న మాజీ సర్పంచ్ సోదరుడు షాజహాన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడని, తీవ్రంగా గాయపడిన మాజీ సర్పంచ్, ఆయన కుమారుడిని అంబులెన్స్‌లో తిరుత్తణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ హుమయూన్ మృతి చెందాడని, హబీబ్‌కు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై అపోలో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. హుమయూన్, షాజహాన్ సోదరుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారని చెప్పారు. పీలేరు మేజర్ గ్రామ పంచాయతీకి హుమాయూన్ 2001, 2010లో రెండు పర్యాయాలు సర్పంచ్‌గాను, ఒక పర్యాయం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులుగా, సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఇతనికి భార్య, ముగ్గురు కుమారులు, కోడళ్ళు ఉన్నారు.

హుమయూన్ మృతి బాధాకరం : ఎమ్మెల్యే

వైద్యం కోసం చెన్నై వెళుతూ తిరుత్తణి సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో పీలేరు మాజీ సర్పంచ్ హుమయూన్, ఆయన సోదరుడు షాజహాన్ మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మృతుల ఆత్మశాంతికి నివాళులు అర్పించారు. హుమయూన్, ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హుమాయూన్ కుమారుడు హబీబ్ త్వరగా కోలుకోలుకుని క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. అందరితో కలిసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఆటో ఢీకొని వృద్ధురాలు..

కలికిరి : ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కలికిరి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..కలికిరి క్రాస్ రోడ్డుకు చెందిన చింతపర్తి మంగమ్మ (82) సోమవారం ఉదయం రోడ్డు దాటుతుండగా వేగంగా వెళుతున్న ఆటో వేగంగా ఢీకొనడంతో రోడ్డుపైన పడి తలకు తీవ్ర గాయం అయ్యింది. 108వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రి కి చికిత్స నిమిత్తం తరలించారు.చికిత్స పొందుతూ మృతి చెందినటుల తెలిపారు. మృతురాలు కూతురు రామకుమారి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ ఫిట్టర్‌పై హత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె మున్సిపాలిటీ లో ఫిట్టర్ గా పనిచేస్తున్న సుధాకర్‌పై ప్రత్యర్థులు రాళ్లు, కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొన్నేళ్లుగా ఫిట్టర్ గా పనిచేస్తున్న సుధాకర్ విధి నిర్వహణలో భాగంగా మధుసూదన సినిమా థియేటర్ వద్ద ఉన్నాడు. రోడ్డుపై నిలబడి ఫోన్ లో మాట్లాడుకుంటున్నాడు. ఈ సమయంలో గాంధీపురంకు చెందిన రాజా, ప్రదీప్, రవి మరికొంత మంది ఒక్కసారిగా సుధాకర్ పై విచక్షణ రహితంగా దాడి చేసి, రాళ్లతో కొట్టి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు రక్తపు మడుగులో ఉన్న బాధితున్ని వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తన భార్యతో ఎందుకు మాట్లాడుతున్నావని ప్రశ్నించినందుకు రాజా ఈ ఘాతకానికి పాల్పడినట్లు బాధితుడు సుధాకర్ వాపోయాడు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బియ్యం కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి - నందలూరు

నందలూరు పి.ఎస్ క్రైమ్ నెంబర్ 15/2022 కేసులో ఎ4 ముద్దాయిగా ఉన్న తిరుపతి పట్టణం కరకంబేడు వీధి చెందిన చంద్ర రమేష్ అనే వ్యక్తి స్టోర్ బియ్యం కేసులో ముద్దాయిగా ఉన్నాడు. కోర్టు వాయిదాలకు హాజరుకానందున కోర్టు వారు అతనిపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేయడంతో అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దాయిని సోమవారం నందలూరు కోర్టులో హాజరు పరచగా సదరు కోర్టు వారు రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్ జైల్ కి పంపించడం జరిగిందని అన్నారు. కేసులలో ఉన్న పతి ఒక్కరు కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరు కావాలని ఎస్ఐ కోరారు.